సాక్షి అనంతపురం

సోమవారం, 1, సెప్టెంబర్, 2025



మహా గణపతిం.. మనసాస్మరామి

అనంతపురం హెచ్చెల్సీ కాలువ వద్ద లంబోదరుడి విగ్రహాల నిమజ్జనం



గణేశుడి శోభాయాత్ర సందర్భంగా భక్తులతో కిక్కిరిసిన అనంతపురం సప్తగిరి సర్కిల్

వినాయక.. సెలవిక

గంగమ్మ ఒడికి పార్వతీ తనయుడు

- గణనాథుని నామస్మరణతో మార్మోగిన అనంతపురం
- నయన మనోహరంగా శోభాయాత్ర
- కిక్కిరిసిన పురవీధులు
- విగ్రహాల నిమజ్జనానికి తరలివచ్చిన భక్తజనం
- వర్షంలోనూ ఉరిమే ఉత్సాహం
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్: ఉత్సాహం ఉరకలెత్తింది. భక్తిభావం ఉప్పొంగింది. 'గణపతి బప్పా మోరియా', 'గణేష్ మహ రాజ్‌కీ జై' నినాదాలు మార్మోగాయి. ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా అనంతపురం నగరం ఆధ్యాత్మిక సాగరంలో ఓలలాడింది. గణేశుడి విగ్రహాల శోభాయాత్రను పురస్కరించుకుని పురవీధులు కిటకిటలాడాయి. భక్తుల జయజయ ధ్వానాల నడుమ విగ్రహాల ఊరేగింపు కనులపండువగా సాగింది.

వర్షం కురుస్తున్నా..

అనంతపురం నగరానికి తలమానికంగా సప్తగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ శోభాయాత్ర సాయంత్రం 5.15 గంటలకు మొదలైంది. ఎస్పీ జగదీష్ పతాకాన్ని ధ్వజా వరోహణం చేసి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా లంబోదరుడిని కనులారా తిలకించేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో సప్తగిరి సర్కిల్ కిక్కిరిసిపోయింది. వర్షం కురుస్తున్నా నగరవాసులు వెల్లువలా తరలిరావడం గమనార్హం.

ఉరకలెత్తిన ఉత్సాహం..

నిమజ్జనం సందర్భంగా అందరిలో ఉత్సాహం ఉరకలెత్తింది. చిన్నా పెద్దా తేడా లేకుండా సందడి చేశారు. యువకులు, చిన్నారులు కేరింతలు కొడుతూ ఆనందోత్సాహాల్లో మునిగి తేలారు. కాషాయ వస్త్రాలు తలకు చుట్టుకుని 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో మార్మోగించారు. సినిమా పాటలకు డ్యాన్సులు చేస్తూ, రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా ముందుకు సాగారు. శోభాయాత్రలో కళాకారులు పౌరాణిక వేషాలతో సందడి చేశారు. కర్రసాము విన్యాసాలు, కోలాటాలతో ఆకట్టుకున్నారు. రాజస్తానీ షేర్‌డ్రమ్స్‌తో హోరెత్తించారు.

మళ్లీ కలుస్తా..

నగరంలో ఏర్పాటు చేసిన విగ్రహాలన్నీ ఊరేగింపుగా సుమారు రాత్రి 10 గంటల సమయంలో టవర్‌క్లాక్ సర్కిల్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి పది అడుగుల కంటే తక్కువ ఎత్తున్న విగ్రహాలను అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి చెక్‌డ్యాం, నగర సమీపంలోని హెచ్చెల్సీ వద్దకు తీసుకెళ్లి నీళ్లలో నిమజ్జనం చేశారు. అంతకంటే పెద్ద విగ్రహాలను ఆత్మకూరు మండలం వడ్డిపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేశారు. ఐదు రోజులు పూజలందుకుని ఆశీర్వదించిన గౌరీ తనయుడు 'మళ్లీ కలుస్తా.. ఇక సెలవు' అంటూ గంగమ్మ ఒడికి చేరాడు.



గంగమ్మ ఒడికి చేరిన వినాయకుడు



శోభాయాత్రలో పాల్గొన్న పుర ప్రముఖులు



శోభాయాత్రలో యువకుల ఉత్సాహం



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగదీష్



కోలాటం ఆడుతున్న కళాకారులు

న్యూస్‌రీల్

పేదల అర్జీలు.. బుట్టదాఖలు!



అనంతపురం అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించే చాలా అర్జీలు బుట్టదాఖలవుతున్నాయి. పేద ప్రజలు వ్యయ ప్రయాసలకోర్చి ఇస్తున్న వినతిపత్రాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. ప్రధానంగా విభాగాల సూపరింటెండెంట్లకు వెళ్లే అర్జీలు నమోదు కావడం లేదని తెలిసింది. దీంతో అర్జీదారులకు రసీదు అందని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో పరిష్కార వేదికలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓ, ఇతర అధికారులకు సమర్పిస్తారు. అందిన అర్జీలను ఎప్పటికప్పుడు కలెక్టరేట్ ఆవరణలో పరిష్కార వేదిక కౌంటర్లకు సిబ్బంది చేరవేస్తారు. అక్కడి సిబ్బంది వీటిని స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అటు తరువాత అర్జీదారునికి రసీదు ఇస్తారు. నమోదైన అర్జీలు ఆయా శాఖలకు ఆన్‌లైన్‌లోనే పంపిస్తారు. ఇంత వరకు బాగానే ఉన్నా అర్జీలను చాలా సందర్భాల్లో అధికారులు కలెక్టరేట్‌లోని విభాగాల సూపరింటెండెంట్లకు అందిస్తున్నారు. వీరు దాన్ని తీసుకుని తమ వద్ద ఉంచుకుంటున్నారే తప్ప కౌంటర్లకు పంపడం లేదని తెలిసింది. దీంతో ఆ వినతిపత్రాలు ఎటూ కాకుండా పోతున్నాయి. ఈ క్రమంలో అర్జీదారునికి రసీదు అందక పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవడానికి వీలు లేకుండా పోయింది. దీనిపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి 'పరిష్కార వేదిక'లో సమర్పించే ప్రతి అర్జీ తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నేడు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'

అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి. వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు అర్జీతో పాటు ఫోన్ నంబర్, ఆధార్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. అర్జీ స్థితిని కాల్ సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీలను 'పరిష్కార వేదిక'లోనే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గుంతకల్లు ఆస్పత్రిలో కరెంటు కష్టాలు



కరెంట్ పోవడంతో బాలింత, చిన్నారులకు టవల్‌తో గాలి ఊపుతున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఆదివారం కూడా సాయంత్రం 7 గంటల నుంచి దాదాపు 2 గంటలకు పైగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. దీంతో రోగులు నానా అవస్థలు పడ్డారు. ముఖ్యంగా చిన్నపిల్లల వార్డులో పురిటి బిడ్డలు, బాలింతలు ప్రత్యక్ష నరకం అనుభవించారు. ఒక వైపు దోమల తాకిడి, మరోవైపు ఉక్కపోతతో అల్లాడిపోయారు. ఆస్పత్రికి గుంతకల్లు పట్టణ, మండలంలోని ప్రజలతో పాటు ఉరవకొండ, కర్నూలు జిల్లా ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాలకు చెందిన రోగులు వస్తుంటారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆస్పత్రిని 150 పడకలకు అప్‌గ్రేడ్ చేసి రూ.13 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినప్పటి నుంచి రోగుల సంఖ్య మరింతగా పెరిగింది. ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన జనరేటర్‌లో ఇటీవల తరచూ సమస్యలు తలెత్తుతుండడం రోగులకు శాపంగా మారింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రతిసారీ చుక్కలు కనబడుతున్నాయి. ఆస్పత్రిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన కూటమి ప్రభుత్వ పెద్దలు అలసత్వం ప్రదర్శిస్తుండడం మరింత ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డిని వివరణ కోరగా ఆయన స్పందించారు. జనరేటర్‌లో వైర్ల వ్యవస్థ దెబ్బతిందని చెప్పారు. నూతన వైర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాబు సర్కారులో 'బీమా'య

- రైతన్నకు కుచ్చుటోపీ
- 2023, 2024 వాతావరణ బీమా పరిహారం ఇవ్వని వైనం

అనంతపురం అగ్రికల్చర్: చంద్రబాబు సర్కారు కరువు రైతుకు కుచ్చుటోపీ పెడుతోంది. అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో మొదటి ఏడాది పైసా ఇవ్వకుండా రైతులను దారుణంగా మోసపుచ్చింది. ఇటీవల అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ కింద పెట్టుబడి సాయం విడుదల చేసినా.. అందులోనూ వేలాది మందికి కోత విధించింది. ఈ ఒక్క సాయం మినహా చంద్రబాబు సర్కారు రైతు సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. తాజాగా వాతావరణ బీమా కింద పరిహారం ఇవ్వకుండా నిలువునా మోసం చేసే పరిస్థితి నెలకొంది.

మూడు సీజన్లకు రూ.77.49 కోట్లే...

ఇటీవల ఫసల్‌బీమా కింద మూడు సీజన్లకు కలిపి (2023 ఖరీఫ్, 2023 రబీ, 2024 ఖరీఫ్) ఫ్యూచర్ జనరిక్ బీమా కంపెనీ ద్వారా కేవలం రూ.77.49 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. అందులో 2023 ఖరీఫ్‌కు సంబంధించి కంది, ఎండుమిరప, జొన్న రైతులకు రూ.3.39 కోట్లు, రబీలో పప్పుశనగ, వేరుశనగ రైతులకు రూ.15.26 కోట్లు విడుదల కానుండగా 2024 ఖరీఫ్‌కు సంబంధించి కంది, జొన్న రైతులకు రూ.58.83 కోట్లు.. మొత్తంగా మూడు సీజన్లకు కలిపి ఫసల్‌బీమా కింద రూ.77.49 కోట్లు మంజూరు చేసింది. ఒక్క సీజన్‌కే ఇంతకన్నా అధిక మొత్తంలో పరిహారం ఇవ్వాల్సి ఉండగా మూడు సీజన్లకు చాలా తక్కువగా పరిహారం ఇచ్చి రైతులకు అన్యాయం చేసింది.



రెండేళ్లుగా బీమా లేదు..

2023లో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి ఎలాంటి ప్రీమియం వసూలు చేయకుండా ఈ–క్రాప్ ఆధారంగా సాగు చేసిన ప్రతి పంటకూ ఉచితంగా అటు ఫసల్‌బీమా ఇటు వాతావరణ బీమా పథకాన్ని వర్తింపజేసింది. 2024 జూన్‌లో ప్రభుత్వం మారడంతో పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. చంద్రబాబు సర్కారు నిబంధనల మేరకు బీమా కింద రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా దాటవేత ధోరణి అవలంబిస్తోంది. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2018 ఖరీఫ్‌కు సంబంధించి పంటల బీమా కింద పెద్ద మొత్తంలో పరిహారం అందించింది. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం 2023 ఖరీఫ్, రబీ బీమా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల హయాంలో రైతులపై పైసా భారం మోపకుండా ఉచిత పంటల బీమా కింద ఏకంగా 6.47 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.1,161 కోట్ల బీమా పరిహారం జమ చేయడం గమనార్హం.

ఆశగా రైతన్న..

2023లో ఖరీఫ్‌లో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఖరీఫ్‌లో వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, చీనీ, దానిమ్మ, టమాట పంటలకు, ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరపకు పరిహారం అందించింది. తొలిసారిగా ఆముదం పంటను కూడా బీమా పరిధిలోకి తెచ్చింది. 2023 ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల కారణంగా 3.70 లక్షల హెక్టార్లకు గానూ 2.50 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం 28 మండలాలతో కరువు జాబితా కూడా ప్రకటించింది. 2023 రబీలో వాతావరణ బీమా కింద అరటి, టమాటకు ఇవ్వగా ఫసల్ బీమా కింద పప్పుశనగ, వేరుశనగ, వరి, జొన్న, మొక్కజొన్నకు వర్తింపజేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సర్కారు విధిలేని పరిస్థితుల్లో ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమాను అమలు చేసింది. వాతావరణ బీమా కింద వేరుశనగ, పత్తి, అరటి, టమాట, చీనీ, దానిమ్మ పంటలు, ప్రధాన మంత్రి ఫసల్‌బీమా పథకం కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప పంటలకు వర్తింపజేసింది. 2024 ఖరీఫ్‌లో కూడా అనుకూల వర్షాలతో 3.47 లక్షల హెక్టార్లకు గానూ 3.20 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చాయి. అయితే 2024 రబీ నుంచి ప్రీమియం వసూలు చేస్తూ బీమా పథకాలు అమలు చేశారు. అందులో వాతావరణ బీమా కింద టమాట, మామిడి, ఫసల్‌బీమా కింద పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వరి పంటలకు వర్తింపజేశారు. 2023, 2024లో అతివృష్టి, అనావృష్టి, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పంట దిగుబడులు తగ్గిపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఈ నాలుగు సీజన్లకు సంబంధించి చంద్రబాబు సర్కారు ఇప్పటి వరకు వాతావరణ బీమా కింద పరిహారం ఇవ్వకుండా దాటవేస్తూ కుచ్చుటోపీ పెట్టే ప్రయత్నాలు చేస్తుండటంపై రైతులు మండిపడుతున్నారు.

హాజరులో కనికట్టు... బిల్లులు కొల్లగొట్టు

- రాగులపాడు గిరిజన గురుకుల పాఠశాలలో మాయాజాలం
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ప్రిన్సిపాల్ బాధ్యతలు ఇవ్వడంతో నిర్వాకం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి గిరిజన గురుకులాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. విద్యార్థులకు అందించే భోజనం విషయంలోనూ అవకతవకలకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. పండుగలు, సెలవుల సమయాల్లో ఇళ్లకెళ్లిన విద్యార్థులను కూడా హాజరైనట్లు నమోదు చేసి బిల్లులు నొక్కేస్తున్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడులోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 76 మంది ఉన్నారు. వినాయక చవితి పండుగ కోసం ఆగస్టు 26నే విద్యార్థులు వారి సొంత ఊళ్లకు వెళ్లారు. పిల్లలు పాఠశాలలో లేకున్నా అందరూ ఉన్నట్లుగా గత నెల 30 వరకూ ఆన్‌లైన్‌లో వంద శాతం హాజరు నమోదు చేయడం గమనార్హం. ఆదివారం కూడా గురుకులంలో నలుగురు విద్యార్థులే ఉన్నారు. ఈ క్రమంలో సరుకులను పక్కదారి పట్టించి రోజుకు రూ. 4 వేల నుంచి రూ. 5 వేల వరకూ నొక్కేసినట్లు తెలిసింది.

బాధ్యతలివ్వడమే వివాదాస్పదం..

రాగులపాడు గురుకుల పాఠశాల రెగ్యులర్ ప్రిన్సిపాల్ ఇటీవల దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి బాల్యనాయక్‌కు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఏకంగా ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించడం వివాదాస్పదమైంది. పాఠశాలలో ఏమైనా జరిగితే ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎలా బాధ్యత వహిస్తారనే విమర్శలు వినిపించాయి. ఈ క్రమంలోనే విద్యార్థుల హాజరు నమోదులో అవకతవకలు బయటకు రావడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

నాణ్యమైన భోజనమూ కరువు..

గురుకులంలో పనిచేసే హెడ్‌కుక్ కూడా ఆరు రోజులుగా లేరు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వెళ్లిపోయారు. దీంతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనమూ అందడం లేదు. గత్యంతరం లేక ఓ ప్రైవేట్ వంట మనిషిని ఏర్పాటు చేసుకోని ఉన్న కొద్దిమంది పిల్లలకు భోజనం అందిస్తున్నారు. వీటిపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రాగులపాడులోని గిరిజన గురుకుల పాఠశాల

విచారణ చేపట్టాలి..

రాగులపాడు గురుకులంలో విద్యార్థులు లేకపోయినా వంద శాతం హాజరువేసి బిల్లులు నొక్కేయడం దుర్మార్గం. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి బాధ్యతలు ఇవ్వడంతోనే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి.

– శివశంకర్‌నాయక్, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు

నిలిచిన రేసింగ్

శింగనమల: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న రేసింగ్ కార్యక్రమంపై వివాదం తలెత్తింది. దీంతో నిర్వాహకులు అర్ధంతరంగా నిలిపివేశారు. బెంగుళూరుకు చెందిన మోటో స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో శింగనమల, నార్పల, పుట్లూరు మండలాల్లో గాలిమరలు, కొండలు, హెచ్చెల్సీ కాలువ గట్ల వద్ద నాలుగు రోజులుగా రేసింగ్ నిర్వహిస్తున్నారు. ఆదివారం శింగనమల మరువకొమ్మ వద్ద ఉన్న గాలిమరల రహదారులపై కారు, బైక్ రేసింగ్ నిర్వహించారు. 33 బైక్‌లు, 16 కార్లు ఇందులో పాల్గొన్నాయి. బెంగళూరు, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన యువకులు రైడింగ్ చేశారు.

అనుమతులపై సర్వత్రా చర్చ..

శింగనమల నియోజకవర్గంలో కార్లు, బైక్ రేసింగ్‌పై సర్వత్రా విమర్శలు మొదలయ్యాయి. సోషల్ మీడియాలో విపరీతంగా చర్చ నడిచింది. ఇలాంటి కార్యక్రమాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రేసింగ్‌పై యువత ఆసక్తి పెంచుకుని కొండలపైకి వెళ్లే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలకేమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సాహస కృత్యాల నిర్వహణకు ఎలా అనుమతులిస్తారని పలువురు ప్రశ్నించారు. ఇదే క్రమంలో రాజకీయ పార్టీల నుంచి కూడా విమర్శలు మొదలయ్యాయి.ఈ క్రమంలోనే రేసింగ్‌ను నిర్వాహకులు నిలిపివేయడం గమనార్హం. రేసింగ్‌పై ఎమ్మెల్యే శ్రావణి ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు.



శింగనమల మరువకొమ్మ వద్ద కారు రేసింగ్ దృశ్యం

క్లుప్తంగా

కాలువలో కొట్టుకొచ్చిన వృద్ధురాలి మృతదేహం


చాకలి సాలమ్మ మృతదేహం

కనగానపల్లి: మండలంలోని తల్లిమడుగుల సమీపంలో హంద్రీ–నీవా కాలువ నీటిలో ఆదివారం మధ్యాహ్నం ఓ వృద్ధురాలు మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానిక యువకులు మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి సమాచారం ఇవ్వడంతో కనగానపల్లి ఎస్ఐ ఎం.రిజ్వాన్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాలువ ఎగువ ప్రాంతాల్లోని గ్రామీణులకు సమాచారం అందించి మృతురాలి ఆచూకీ గుర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కూడేరు మండలం, మరుట్లపల్లి గ్రామానికి చెందిన చాకలి సాలమ్మ(85)గా నిర్ధారణ అయింది. శనివారం సాయంత్రం ఆమె కరుట్లపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువ గట్టుపై నడుచుకుంటూ వెళుతుండగా అదుపు తప్పి నీటిలో పడినట్లుగా కూడేరులో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ రిజ్వాన్ తెలిపారు. కాగా, కుటుంబ కలహాల నేపథ్యంలో కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలికి భర్త గౌరప్ప, ఓ కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద మృతి


నాగేంద్ర (ఫైల్)

శెట్టూరు: మండలంలోని అనుంపల్లికి చెందిన బోయ నాగేంద్ర (25) అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనుంపల్లికి చెందిన బోయ బొమ్మలింగప్ప, ఉమాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు నాగేంద్ర ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కూలి పనులకు వెళ్లిన నాగేంద్ర... సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇంట్లో ఉంటాడని తల్లిదండ్రులు భావించారు. అయితే ఆదివారం ఉదయం వారి ఇంటి వెనక ఉన్న ముళ్ల పొదల్లోకి బహిర్భూమికి వెళ్లిన వారు అక్కడ కంప చెట్టుకు తాడుతో వేసిన ఉరికి విగతజీవిగా వేలాడుతున్న నాగేంద్రను గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, నాగేంద్ర శరీరంపై రక్తపు మరకలు ఉండడం, చిన్నపాటి కంప చెట్టుకు వేసిన ఉరికి వేలాడుతుండడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: ఆర్థిక సమస్యలు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న శ్రీకాంత్ (52)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫైనాన్స్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు, స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కూలిన బతుకులు!

రెక్కాడితే కానీ.. డొక్కాడని పరిస్థితి వాళ్లందరిది. పొట్ట కూటి కోసం ఇంత సద్ది మూట కట్టుకుని ఉదయాన్నే పనులకు బయల్దేరారు. ఆదివారం సెలవు దినమైనా.. పిల్లాపాపలతో ఆడుకోకుండా వారి భవిష్యత్తును బాగుపరచాలని కూలి పనులకు సిద్ధమయ్యారు. అయితే ఊరు దాటిన పది నిమిషాలకే గడిచిన కాలానికి సమాధి కట్టిన జ్ఞాపకమై మిగిలారు. టెంపో రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు మహిళా కూలీలను కబళించింది. దీంతో బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటోను ఢీకొన్న టెంపో
- ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం
- 11 మందికి గాయాలు
- కొత్తచెరువు మండలం మైలసముద్రం సమీపంలో ఘటన
- అందరూ బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి వాసులే


మైలసముద్రం వద్ద ప్రమాదానికి గురైన ఆటో


ప్రమాదానికి కారణమైన టెంపో


మల్లెల లక్ష్మీదేవి (ఫైల్)


మృతురాలు వలిపి లక్ష్మీనరసమ్మ

సాక్షి, పుట్టపర్తి/కొత్తచెరువు: శ్రీసత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కొత్తచెరువు మండలం మైలసముద్రం సమీపంలో వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటోను ఎదురుగా శరవేగంగా దూసుకొచ్చిన టెంపో వాహనం ఢీకొంది. ఘటనలో ఆటోలోని ఇద్దరు మహిళా కూలీలు దుర్మరణం చెందారు. ఆటో డ్రైవర్‌తో సహా మరో 11 మంది గాయపడ్డారు. ఇందులో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది.

మిన్నంటిన ఆర్తనాదాలు

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమయ్యారు. ఆగమేఘాలపై సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను కొత్తచెరువులోని పీహెచ్‌సీకి తరలించారు. క్షతగాత్రులు, బంధువుల ఆర్తనాదాలతో పీహెచ్‌సీ హోరెత్తింది. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను కుటుంబసభ్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు.

నిర్లక్ష్యం.. అతి వేగమే కారణం

దిన కూలి పనుల కోసం ఆదివారం ఉదయం బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి నుంచి మహిళా కూలీలతో చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి ఆటో బయలుదేరింది. కొత్తచెరువు మండలం మైలసముద్రం దాటిన తర్వాత మలుపు వద్ద ఎదురుగా శరవేగంగా దూసుకొచ్చిన టెంపో వాహనం ఢీకొట్టింది. ఇరుకైన రోడ్డు కావడం.. అవతలి వైపు నుంచి వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదం నుంచి ఆటో తప్పించుకోలేకపోయింది. ప్రమాదంలో లక్ష్మీనరసమ్మ (70) దుర్మరణం పాలు కాగా.. కొత్తచెరువు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మీదేవి (50) మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన 8 మందికి ప్రథమ చికిత్స అందజేసి అనంతపురానికి రెఫర్ చేశారు. స్వల్ప గాయాలైన ముగ్గురు చికిత్స చేయించుకుని ఇంటికెళ్లారు. టెంపో డ్రైవర్ నిర్లక్ష్యం.. అతి వేగమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆటోలో ఉన్నది వీరే..

ఆదివారం ఉదయం బుచ్చయ్యగారిపల్లి నుంచి బయలుదేరిన ఆటోలో మహిళా కూలీలు లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, లక్ష్మమ్మ, మీనమ్మ, రాజేశ్వరి, చిన్న నాగమ్మ, వెంకట నారాయణమ్మ, గంగమ్మ, రమాదేవి, గోపాల్ (డ్రైవర్)తో పాటు మరో ముగ్గురు ఉన్నారు. టెంపో వాహనంలో ఉన్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

ఇటీవల కదిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్య సిబ్బందిపై కొందరు అల్లరిమూకలు దాడి చేసిన నేపథ్యంలో మైలసముద్రం వద్ద చోటు చేసుకున్న ప్రమాదంపై పోలీసులు అప్రమత్తమయ్యారు. దీంతో కొత్తచెరువు పీహెచ్‌సీ వద్ద భారీగా బలగాలను మోహరింపజేశారు. బాధితుల తరఫున వచ్చిన వాళ్లందరూ ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా.. కుదరదని చెప్పడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ తర్వాత పోలీసు అధికారులు రంగంలోకి దిగడంతో సమస్య సద్దుమణిగింది. ఆస్పత్రిలో ఒకరు మరణించడంతో చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు. మధ్యాహ్నం వరకూ పోలీసులు బందోబస్తులో ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ మారుతీశంకర్ తెలిపారు.

అనంత యువకుడి దుర్మరణం


అంజన్‌కుమార్ (ఫైల్)

పెనుకొండ రూరల్: టైర్ బరెస్ట్ అయి కారు అదుపు తప్పిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరంలోని మొదటి రోడ్డులో నివాసముంటున్న గొల్ల అంజనకుమార్ (34)కు భార్య రాజేశ్వరి, ఓ కుమారుడు ఉన్నారు. ఎరువుల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో వ్యాపార నిమిత్తం బెంగళూరుకు వెళ్లిన అంజనకుమార్.. ఆదివారం వేకువజామున కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. తెల్లవారుజామున పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని వై జంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై కంచర్ల హోటల్ వద్దకు చేరుకోగానే కారు టైర్ బరెస్ట్ అయింది. దీంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో కారు అదుపు తప్పి జాతీయ రహదారి భద్రత కోసం ఏర్పాటు చేసిన ఇనుప ప్రహరీలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అంజనకుమార్‌ను స్థానికులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై కియా పీఎస్ ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భూములు లాక్కోవాలని చూస్తే సహించం

- జనార్ధనపల్లి సర్పంచ్, టీడీపీ నేతల దౌర్జన్యంపై పోరాడుతాం
- వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ఉరవకొండ: అధికారాన్ని అడ్డు పెట్టుకుని దౌర్జన్యంగా భూములు లాక్కోవాలని చూస్తే సహించబోమని, బాధిత రైతులతో కలసి విస్తృత పోరాటాలు సాగిస్తామని టీడీపీ నేతలను వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు. ఉరవకొండకు చెందిన బాధిత రైతు జయకుమార్‌తో కలసి ఆదివారం స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఏసీ ఎర్రిస్వామి, సింగాడి తిప్పయ్య, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కొడిగి గోవిందు, పార్టీ మండల సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న తదితరులు మాట్లాడారు. జనార్ధనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 141లో 21.05 ఎకరాల భూమిని సాయిప్రసాద్, వెంకటశర్మ, భానుప్రకాష్‌రావు నుంచి 2023, జూన్ 24న రైతు జయకుమార్ కొనుగోలు చేసి, పంటల సాగు చేపట్టాడన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ భూమిని కబ్జా చేసేందుకు కొందరు టీడీపీ నేతలు ప్రయత్నిస్తూ జయకుమార్‌ను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కేశవ్ అండతో జనార్ధనపల్లి గ్రామ సర్పంచ్ (టీడీపీ) రామంగి జనార్ధననాయుడు, టీడీపీ నాయకులు సుధాకర్, ముప్పారపు పాండురంగ, కురుపాటి కృష్ణమూర్తి దౌర్జన్యాలకు తెరలేపారన్నారు. తమది కాని భూమిలో చొరబడి కంది పంట సాగుచేయడానికి పొలాన్ని దుక్కి చేశారన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన బాధిత రైతుపై దౌర్జన్యం చేశారన్నారు. దీంతో రైతు జయకుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. అయినా టీడీపీ నేతలు దౌర్జన్యం సాగిస్తూ మొత్తం 21 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కుట్రలు సాగిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా టీడీపీ నేతలు తమ దౌర్జన్యాలకు స్వస్తి చెప్పకపోతే బాధిత రైతు తరఫున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చాబాల సర్పంచ్ జగదీష్, నాయకులు సుంకన్న, మర్రిస్వామి, డిష్ వెంకటేష్, సురేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా విజయభాస్కరరెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం) సంఘం రాష్ట్ర కమిటీలో జిల్లాకు కీలక పదవి లభించింది. సంఘం రాష్ట్ర కోశాధికారిగా ఉరవకొండ మండలం బూదగవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.విజయభాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలోని లయోలా కళాశాలలో సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు అనంతపురం జిల్లా హెచ్‌ఎం అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు.

బాత్రూంలో జారిపడి అర్చకుడి మృతి

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామంలో ఆదివారం బాత్రూంలో కాలుజారి పడి అర్చకుడు సతీష్‌కుమార్ (45) మృతి చెందాడు. రాప్తాడు మండలం పాలచర్ల రామాలయంలో ఆయన పూజారిగా పనిచేస్తున్నాడు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం ఇంటి వద్ద బాత్రూంలోకి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు గుర్తించి ధర్మవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా, సతీష్‌కుమార్‌కు భార్య, కుమారుడు ఉన్నారు.

నిన్న బుక్ పోస్టు.. నేడు రిజిస్టర్ పోస్టు రద్దు

దశాబ్దాలుగా కొనసాగుతూ వచ్చిన బుక్ పోస్టును రద్దు చేసిన కేంద్ర తపాలా శాఖ.. తాజాగా మరో నిర్ణయం తీసుకుంది. సాంకేతిక అందిపుచ్చుకున్న నేటి తరంలోనూ ఏమాత్రం ఆదరణ తగ్గని రిజిస్టర్ పోస్టును ఈ నెల 1 నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీనిని స్పీడ్ పోస్టులో విలీనం చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిర్ణయంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడనుంది.



అనంతపురంలోని తపాలా శాఖ ప్రధాన కార్యాలయం

అనంతపురం సిటీ: తక్కువ ఖర్చుతో అనువైన తపాలా సేవగా రిజిస్టర్ పోస్టు.. ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ సేవలను రద్దు చేస్తూ స్పీడ్ పోస్టులో విలీనం చేస్తూ కేంద్రంలోని కూటమి సర్కార్ తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కీలకమైన పత్రాలు సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలు, ప్రభుత్వ పెద్దలు, అధికారులకు చేరాలంటే రిజిస్టర్ పోస్టును ఏకైక మార్గంగా ప్రజలు భావించేవారు. తపాలా ఉద్యోగులు కూడా అంతే నమ్మకంతో సేవలందిస్తూ వచ్చారు. దీంతో ఎప్పటి నుంచో రిజిస్టర్ పోస్టుకు ఎనలేని ఆదరణ ఉంది.

స్పీడ్ పోస్టుతో ఖర్చు తడిసిమోపెడు

రిజిస్టర్ పోస్టు సేవలను రద్దు చేస్తూ స్పీడ్ పోస్టులోకి విలీనం చేయడం ద్వారా వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడనుంది. సాధారణంగా ఒక ఎన్వలప్ కవర్‌లో ఏదైనా పత్రం ఉంచి దానిని సాధారణ పోస్టు ద్వారా పంపాలంటే రూ.5 స్టాంపు వేస్తే సరిపోయేది. అదే రిజిస్టర్ పోస్టులో అయితే రూ.17 స్టాంప్ జోడించాల్సి వచ్చేది. ఈ లెక్కన రూ.22తో వారి పత్రాలు భద్రంగా అవతలి వ్యక్తులకు చేరేవి. అయితే అంతే బరువు కలిగిన కవర్ స్పీడ్ పోస్టులో పంపాలంటే రూ.45 చెల్లించుకోక తప్పడం లేదు.

విపరీతమైన భారం



కథలు, కవితలు, వ్యాపాలను సంకలనాలుగా ప్రచురించి గ్రంథాలయాలకు, పత్రికలకు రిజిస్టర్ పోస్టు ద్వారానే పంపేవాళ్లం. 100 గ్రాముల బరువు ఉంటే రూ.18 మాత్రమే ఖర్చే వచ్చేది. అంతే బరువు ఉన్న వాటికి ఇప్పుడు రూ.45 చెల్లించాల్సి వస్తోంది. ఇది రచయితలు, ప్రచురణకర్తలకు పెనుభారం కానుంది. ఒక వారపత్రిక ధర రూ.20 అయితే దాని పోస్టల్ చార్జీలు రూ.200పైగా అయ్యేలా ఉన్నాయి. ఇది దోపిడీ కాక మరేమిటి?

– కొండసాని రజిత, రచయిత్రి

ప్రయోజనం లేదు



సామాన్య, మధ్య తరగతి ప్రజలకు రిజిస్టర్ పోస్టు ఎంతో ఉపయోగకరం. తక్కువ ఖర్చుతో విలువైన డాక్యుమెంట్లను పంపించేవారం. రిజిస్టర్ పోస్టును రద్దు చేసి స్పీడ్ పోస్టులో కలపడం దురదృష్టకరం. ఇది మంచి పద్ధతి కాదు. ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలపై భారం వేయడాన్ని ఇకనైనా కేంద్ర ప్రభుత్వం మానుకోవాలి.

– సాయిపల్లవి, చిరుద్యోగి, అనంతపురం

ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేసేందుకే..



కేంద్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయమూ కార్పొరేటర్లకు అనుకూలంగా ఉంటున్నాయి. తాజాగా ఎన్నో ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తున్న రిజిస్టర్ పోస్టు రద్దు చేయడం క్షమించరానిది. ప్రైవేట్ కొరియర్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. ఇలాంటి ప్రజా వ్యతిరేక విధానాలు మంచిది కాదు.

– రహత్ బాషా, మెడికల్ రెప్, అనంతపురం

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

తాడిపత్రి టౌన్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన రమాదేవి కుమారుడు నవీన్‌కుమార్ (20) బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికంగా ఉన్న ఓ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న అతను ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు

యల్లనూరు: రైతులను మోసగించిన కేసులో అరటి కాయల వ్యాపారిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు యల్లనూరు పీఎస్ హెచ్‌సీ శంకరనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నార్పల మండలం నీలితొట్టిపల్లి కి చెందిన అరటికాయల వ్యాపారి వెన్నపూస వెంకట్రామిరెడ్డి 2024, ఫిబ్రవరి 26న యల్లనూరుకు చెందిన రైతు సానే నాగేంద్ర, ఆయన తమ్ముళ్లు రామ్మోహన్, చంద్రశేఖర్ సాగు చేసిన అరటి పంట దిగుబడిని రూ.15 లక్షలతో కొనుగోలు చేశాడు. ఆ సమయంలో ఒక్కో రైతుకు రూ.3 లక్షల చొప్పున రూ. 9 లక్షలను అడ్వాన్స్‌గా చెల్లించాడు. మిగిలిన రూ. 6 లక్షలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఇటీవల ఫోన్ కాల్‌కు సైతం స్పందించకపోవడమే కాక,, డబ్బులు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యం సాగిస్తుండడంతో బాధిత రైతుల పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు వెన్నపూస వెంకట్రామిరెడ్డిపై చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

స్త్రీ శక్తికి తప్పని నిరీక్షణ




గుంతకల్లు: బోర్డుపై అంతర్రాష్ట్ర సర్వీసు స్టిక్కర్ అతికించిన దృశ్యం , ఆత్మకూరు: బస్సు కోసం పంపనూరు బస్టాండ్ వద్ద వేచి ఉన్న మహిళలు

- అంతరాష్ట్ర సర్వీసుల్లో 'స్త్రీ శక్తి వర్తించదు'
- గంటల తరబడి బస్టాండ్‌లోనే మహిళల పడిగాపులు

గుంతకల్లు/ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నరకం చూపుతోంది. పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతానికి వెళ్లే అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఉచిత ప్రయాణం లేదంటూ కండక్టర్లు స్పష్టం చేస్తుండడంతో గంటల తరబడి బస్టాండులో పడిగాపులు కాయక తప్పడం తప్పడం లేదు. గుంతకల్లు–బళ్లారి మార్గంలోని పెంచలపాడు, గడేకల్లు, డోనేకల్లు గ్రామాల మహిళలకు ఉచిత ప్రయాణ యోగం దక్క లేదు. రోజూ ఈ ప్రాంత ప్రజలు ఏదో ఒక పనిపై గుంతకల్లుకు రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో మహిళా ప్రయాణికులు సైతం తప్పని పరిస్థితుల్లో టికెట్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. అలాగే గుత్తి–గుంతకల్లు–బళ్లారి, తాడిపత్రి–గుత్తి–గుంతకల్లు–బళ్లారి అంతర్రాష్ట్ర సర్వీసు బస్సులో గుంతకల్లు నుంచి గుత్తి, తాడిప్రతి వెళ్లాలన్నా ఈ పథకం వర్తించడం లేదు. కనీసం ఆంధ్ర సరిహద్దు నుంచైనా అంతర్రాష్ట్ర సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించాలని మహిళ ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై గుంతకల్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్‌ను వివరణ కోరగా అంతర్రాష్ట్ర సర్వీసులకు స్త్రీ శక్తి పథకం వర్తించదని స్పష్టం చేశారు.

గంటల తరబడి పడిగాపులు

అనంతపురం – బళ్లారి మార్గంలో ఉన్న ఈ ఆలయానికి ప్రతి ఆది, మంగళవారాల్లో ఆత్మకూరు మండలం పంపనూరు క్షేత్రానికి భక్తులు పోటెత్తుతుంటారు. ఇందులో అధిక సంఖ్యలో మహిళా భక్తులే ఉంటున్నారు. ఉన్న అరకొర ఎక్స్‌ప్రెస్ బస్సులకు అంతర్రాష్ట్ర సర్వీసు అని బోర్డు పెడుతున్నారు. దీంతో గంటల తరబడి పంపనూరు బస్టాఫ్ వద్ద మహిళా భక్తులకు పడిగాపులు కాయక తప్పడం లేదు. మాములు రోజుల్లో కాకపోయినా... ఆది, మంగళవారాల్లో ఆత్మకూరు మీదుగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.


ఆత్మకూరు: ఉచిత ప్రయాణం చెల్లదని చెబుతున్న కండక్టర్

నిమజ్జనం.. నీరాజనం



నిమజ్జనానికి తరలుతున్న విగ్రహాలు



ప్రత్యేక వాహనంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



అనంతపురం క్లాక్ టవర్ వద్ద శోభాయాత్రను తిలకించేందుకు తరలివచ్చిన అశేష భక్తజనం



ఊరేగింపుగా వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న యువకులు

అనంతపురం కల్చరల్/రాప్తాడు: వినాయక ఉత్సవాల్లో ఐదోరోజు ఆదివారం అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో విగ్రహాల నిమజ్జనం భక్తిశ్రద్ధల నడుమ సాగింది. మంటపాల్లో కొలువుదీరిన గణేశుడు ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలందుకున్నారు. నిమజ్జనం సందర్భంగా అన్నదానాలు.. లడ్డూ ప్రసాదాల వేలం నిర్వహించారు. అనంతరం శోభాయాత్ర ప్రారంభమైంది. ప్రత్యేక వాహనాల్లోకి విగ్రహాలను కొలువుదీర్చి ఊరేగింపుగా తీసుకెళ్లారు. డ్రమ్స్ వాయిద్యాల నడుమ యువత, మహిళలు, చిన్నారులు చిందులు వేశారు. జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. పార్వతీ తనయుడు వినాయకునికి జై అంటూ నినదించారు. అనంతరం చెరువులు, కాలువలు, నీటి కుంటలు, వంకల్లో నిమజ్జనం చేశారు.



అనంతపురంలోని సప్తగిరి సర్కిల్‌లో కోలాహలం

సోదరభావానికి ప్రతీక వినాయక చవితి

- శోభాయాత్రను ప్రారంభించిన ఎస్పీ జగదీష్

అనంతపురం కల్చరల్: కుల మతాలకతీతంగా అందరూ ఏకమై సోదరభావంతో చేసుకునే అరుదైన పండుగ వినాయక చవితి అని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక సప్తగిరి సర్కిల్‌లోని వినాయక చౌక్‌లో జరిగిన కార్యక్రమానికి ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై.. ఓం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వినాయక నిమజ్జన శోభాయాత్రను జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సందిరెడ్డి శ్రీనివాస్, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు పరుచూరు రమేష్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ముఖ్య వక్తగా కరీంనగర్ నుంచి విచ్చేసిన విద్యాభారతి ప్రతినిధి లక్ష్మణరావు మాట్లాడుతూ సనాతన భారతీయ సంస్కృతిలో పర్వదినాల విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య శిష్యబృందాలు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవ సమితి సభ్యులు నాగన్న, వేణుగోపాల్, రామచంద్రయ్య, దీప్తి మురళీ, లలిత్‌కుమార్, హిందూ వాహిని మందరపు వెంకటరమణ , హాస్యనటుడు తిరుపతి ప్రకాష్ పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణ

ఆత్మకూరు: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన పెద్ద పెద్ద వినాయకుని విగ్రహాలను ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీ –నీవా కాలువలో నిమజ్జనం చేశారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకూ విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. కాలువ దగ్గర భక్తులకు ఇబ్బంది లేకుండా బారికేడ్లను, లైట్లను ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. నిమజ్జన కార్యక్రమాన్ని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, ఆర్డీఓ కేశవనాయుడు, ఎంపీడీఓ లక్ష్మినరసింహ, ఎస్‌ఐ లక్ష్మణరావు పర్యవేక్షించారు.



ఆదర్శకాలనీలో నిమజ్జనానికి తరలి వెళ్లిన వినాయకుడు



చిన్మయనగర్‌లో నిమజ్జనానికి వెళ్తున్న 'సిందూర్ వినాయకుడు'



హెచ్చెల్సీలో విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



వినాయక నిమజ్జనం సందర్భంగా మహిళల ఆనందం

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథ స్వామి వారికి, పార్వతీ దేవికి అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళ తాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు



గాయపడిన గంజి రమేష్

రాప్తాడు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం రాప్తాడుకు చెందిన గంజి రమేష్ హంపాపురం సమీపంలోని మౌనగిరి క్షేత్రం 49 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో ఉన్న గొర్రెల మంద వద్దకు ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో బైక్‌పై బయల్దేరాడు. రామినేపల్లి సమీపంలో బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రమేష్ చెయ్యి రెండు చోట్ల విరిగింది. తలకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 సిబ్బంది అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం టవర్‌క్లాక్: కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక సంఘాలు ఐక్యతతో ఉండాలన్నారు. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు నిర్మాణాన్ని పటిష్ట పరుచుకోవాలన్నారు. కార్మిక సమస్యలు దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవాలన్నారు. ఎన్డీఏ కూటమి తెచ్చిన లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిక్కన్న, రఘునాథ్‌రెడ్డి, జిలాన్, రామిరెడ్డి, రామాంజినేయులు, సురేష్, ఏసురత్నం, సురేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రాధాష్టమి వేడుకలు



ఇస్కాన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన

అనంతపురం కల్చరల్: రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయం వారి ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. హరేకృష్ణ హరే రామ నామస్మరణతో మార్మోగించారు. వలీస్వామి ఆశ్రమ ప్రతినిధి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాధాష్టమి హైందవ సంప్రదాయంలో గొప్ప పర్వదినంగా పేర్కొన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది. ఇస్కాన్ మందిరంలో రాధాష్టమి వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. ఉదయం పాలు,తేనెతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం మందిర ప్రతినిధులు ప్రవచనంలో రాధాపార్థసారథుల ఆవిర్భావ విశిష్టతను, పురాణ ఘట్టాలను వివరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, రాత్రి అలంకార సేవలలో సామూహిక దర్శన వసతి కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాధాపార్థసారథుల ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కళ్యాణదుర్గం రూరల్: ఆర్థిక సమస్యలు తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న శ్రీకాంత్ (52)కు భార్య, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఫైనాన్స్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల ఆర్థిక సమస్యలు తీవ్రమయ్యాయి. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆయన ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి రోజే... మృత్యు ఒడికి!



హరిత మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖరరెడ్డి



భర్తతో కపాడం హరిత (ఫైల్)

- మృతురాలు ఎం.చెర్లోపల్లి మాజీ ఎంపీటీసీ కోడలు

రాప్తాడు: మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కపాడం నాగన్న, కపాడం రామాంజినమ్మ దంపతుల (ఇద్దరూ మాజీ ఎంపీటీసీ సభ్యులు) కుమారుడు రామ్మోహన్ భార్య హరిత (26) గత నెల 29న అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందింది. వీరికి ఏడేళ్ల క్రితం 2018, ఆగస్టు 29న వివాహమైంది. రామ్మోహన్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే భార్యతో కలసి ఉంటున్నాడు. నెల రోజుల క్రితం గొంతు నొప్పితో బాధపడుతున్న హరితను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి రామ్మోహన్ పిలుచుకెళ్లి చికిత్స చేయించాడు. ఆ సమయంలో టాన్సిల్స్‌తో ఆమె బాధపడుతోందని, శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని వైద్యులు నిర్ధారించారు. తాత్కాలికంగా మందులు ఇవ్వడంతో అప్పట్లో ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలో గత నెల 29న పెళ్లి రోజును హైదరాబాద్‌లో వేడుకగా జరుపుకున్నారు. అదే రోజు మధ్యాహ్నం గొంతు నొప్పి తీవ్రం కావడంతో హరితను ఆస్పత్రికి తీసుకెళ్లడంతో పరిశీలించిన వైద్యులు వెంటనే సర్జరీకి ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన తర్వాత తీవ్ర ఒత్తిడికి లోనైన హరిత గుండెపోటుకు గురై మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి చేర్చి, బంధుమిత్రుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి... ఎం.చెర్లోపల్లికి చేరుకుని హరిత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులును రాప్తాడులో పరామర్శించారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సాకే వెంకటేష్, యూత్ మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, యూత్ మాజీ కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

ఎన్నికల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేయాలి

- ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర



క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ నాయకులు

అనంతపురం అర్బన్: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో భారత ఎన్నికల కమిషన్ ప్రజల ఓటు హక్కును హరిస్తోందని సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ జిల్లా కార్యదర్శి డి.రాఘవేంద్ర విమర్శించారు. ఎన్నికల్లో రిగ్గింగ్, అవకతవకలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. అధికార పక్ష ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్ ఓటరు జాబితా సవరణ చేపట్టడం సరికాదన్నారు. ఎన్నికల కమిషన్ తీరును వ్యతిరేకిస్తూ ఎస్‌యూసీఐ (సీ)ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ బిహార్ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ కింద ఓటరు జాబితా సవరణ చేపట్టి వివాదాస్పదం చేసిందన్నారు. దేశ పౌరులు మాత్రమే ఎన్నికల జాబితాలో ఉండడానికి అర్హులని పేర్కొనడంతో పాటు గతంలో తాను ప్రచురించిన 7.73 కోట్ల ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల ఓట్లు తొలగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఒక ప్రధాన లక్ష్యంతో సవరణ జరిగి ఇలా ఓట్లు తొలగించడం ఓటు హక్కును హరించడం మాత్రమే కాదని, అలా చేయడం ఒకరకంగా పౌరసత్వాన్ని నిరాకరించడమేనని అన్నారు. పౌరసత్వాన్ని నిర్ధారించడం ఎన్నికల కమిషన్ విధి కాదన్నారు. కమిషన్ సూచించిన 11 గుర్తింపు పత్రాల్లో ఆధార్, రేషన్‌కార్డు, ప్రత్యేకించి ఫొటోతో ఉన్న ఓటర్ ఐడీ కార్డుల ద్వారా కచ్చితమైన ఓటరు జాబితా ఆధారంగా సక్రమ, స్వేచ్ఛాయుత ఎన్నికలను రూఢీ చేయాలన్నారు. అయితే ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ చేపట్టి ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కారణంగా కోట్ల మంది తమ ఓటు హక్కు కోల్పోయేలా ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఎస్ఆర్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు తబ్రేజ్ ఖాన్, నాగముత్యాలు, మహేష్, కిషోర్, నరేంద్ర, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామి ఆలయంలో చోరీ

గుత్తి: మండలంలోని ఇసురాళ్లపల్లిలో ఉన్న రాఘవేంద్ర స్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. దొంగలు ఆలయం తలుపులను ఓపెన్ చేసి లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని నాలుగు హుండీలను దేవాలయం బయటకు ఎత్తుకెళ్లారు. అక్కడ హుండీలను ధ్వంసం చేసి, అందులో ఉన్న సుమారు రూ.30 వేలను అపహరించారు. ఘటనపై పూజారి నరసింహాచారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

లఘుచిత్రం.. సందేశాత్మకం



కళాకారులను అభినందిస్తున్న మాజీ మేయర్ రాగే పరుశురామ్

అనంతపురం కల్చరల్: రైతుల దీనావస్థకు అద్దం పడుతూ, విపరీతంగా పెరిగిపోతున్న ఫీజులు, మితిమీరుతున్న కొడుకుల కోరికలతో తల్లడిల్లుతున్న రైతుల నేపథ్యంలో సాగిన చిత్రం సందేశాత్మకంగా ఉందని మాజీ మేయర్ రాగే పరుశురామ్ అన్నారు. సీనియర్ కళాకారుడు కత్తి విజయ్‌కుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'కొడుకు కోసం ఓ రైతు' లఘుచిత్రం ఉచిత ప్రదర్శన ఆదివారం నగరంలోని నీలిమ థియేటర్‌లో సాగింది. జిల్లా వ్యాప్తంగా సీనియర్ కళాకారులు, గాయకులు, రచయితలు, కవులు పాల్గొని చిత్ర బృందాన్ని అభినందించారు.రాగే పరుశురామ్‌తో పాటు కాంగ్రెస్ నాయకుడు ఇమామ్, ఆశ్రయ స్వచ్ఛంద సంస్థ కృష్ణారెడ్డి దేవీ దంపతులు, ఘంటసాల స్మారక సేవా సంఘం ప్రతినిధులు రామయ్య, ఆచార్య సుధాకరబాబు, సీనియర్ గాయకుడు కేవీ మహీధర్ మాట్లాడుతూ దశాబ్దాలుగా అనంత కళారంగానికి సేవలందిస్తున్న కత్తి విజయ్‌కుమార్ అద్భుతమైన సందేశాత్మక చిత్రాన్ని తీయడం అభినందనీయమన్నారు. నటీనటులు తరిమెల రాజు, పవన్, సెహల్, లక్కి అద్భుతంగా నటించారని కొనియాడారు. ప్రతి రైతూ చూడవలసిన చిత్రమన్నారు. కార్యక్రమంలో సపారె రాజశేఖర్, రియాజుద్దీన్, ప్రభాకర్, గాయనీమణులు శ్రీదేవి, రమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కిలో ఉల్లి రూ.12



రైతుబజార్‌కు చేరిన ఉల్లి

అనంతపురం అగ్రికల్చర్: బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు గణనీయంగా పతనమైన పరిస్థితుల్లో స్థానిక రైతుబజార్‌లో కూడా ఉల్లి విక్రయాలు మొదలు పెట్టారు. సోమవారం నుంచి కిలో రూ.12 ప్రకారం విక్రయ కేంద్రం ప్రారంభిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి ప్రతాప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీడియం సైజు ఉల్లి ప్రస్తుతానికి 4 టన్నులు సరఫరా అయిందన్నారు. వినియోగదారుల నుంచి డిమాండ్‌ను బట్టి ఉల్లి అమ్మకాలు కొనసాగిస్తామని తెలిపారు.

అన్నీ అడ్డగోలు పనులే!

ఇంజినీరింగ్ విభాగంలో దోపిడీ

- రెవెన్యూ విభాగంలోని రిజిస్టర్ ఇంజినీరింగ్‌కు తరలింపు
- రికార్డును పరిశీలిస్తే వెలుగులోకి అక్రమాలు

అనంతపురం కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అక్రమాలు, అడ్డగోలు బిల్లులకు కేంద్రంగా మారిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.రెవెన్యూ విభాగంలో ఉండాల్సిన రిజిస్టర్‌ను ఇంజినీరింగ్ విభాగానికి తరలించి, అడ్డగోలుగా బిల్లులు చేసుకున్నట్లు విమర్శలున్నాయి. రికార్డును పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని నగర పాలక సంస్థ వర్గాలు చెప్పుకుంటున్నాయి. మూడేళ్ల క్రితం నగర పాలక సంస్థలోని రెవెన్యూ సెక్షన్‌లో పోతులయ్య అండ్ టీం పని చేసేది. ఆ సమయంలో పోతులయ్యపై విమర్శలు రావడంతో అతన్ని అక్కడి నుంచి నీటి సరఫరా విభాగానికి బదిలీ చేశారు. వాస్తవంగా రెవెన్యూ సెక్షన్ పరిధిలోని ఇంటి, నీటి పన్ను రిజిస్టర్లుండాలి. అప్పట్లో వర్క్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు పదవీ విరమణ పొందిన ఓ కీలక అధికారి కుమ్మక్కై ఆ రికార్డును ఇంజినీరింగ్ సెక్షన్‌కు మార్చారు. వాస్తవంగా రికార్డులు ఏ1, ఏ6 జూనియర్ అసిస్టెంట్లు చూడాలి. కానీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చేతికి రూ.కోట్లు పన్నులకు సంబంధించి డిమాండ్ రిజిస్టర్లను అప్పగించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. వాస్తవంగా కొత్తగా ఏదైనా అసెస్‌మెంట్ నమోదు చేస్తే అప్పుడు మాత్రమే వర్క్ ఇన్‌స్పెక్టర్ డిమాండ్ ఫాంను సిద్ధం చేసి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పోతులయ్య, సంజీవరాయుడు ఏకంగా రూ.లక్షల్లో బిల్లులు చేయడంపై చర్చ సాగుతోంది.

వర్క్ ఇన్‌స్పెక్టర్లపై ఆరోపణలు..

ఇటీవల ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి నీటి సరఫరా విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు పోతులయ్య, సంజీవరాయుడు గ్రూపుగా ఏర్పడి రూ.8.5 లక్షల బిల్లు చెల్లించాలంటూ అక్రమాలకు పాల్పడిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, నీటి సరఫరా పన్ను చెల్లింపులకు సంబంధించి డిమాండ్ రిజిస్టర్‌ను సైతం ఇంజినీరింగ్ విభాగానికి తరలించడం వెనుక వర్క్ ఇన్‌స్పెక్టర్ పోతులయ్య ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమార్కులపై చర్యలు తీసుకునేరా?

ప్రస్తుతం ఇంజినీరింగ్ సెక్షన్ ఆధీనంలో ఉన్న డిమాండ్ రిజిస్టర్‌ను కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్ నిశితంగా పరిశీలిస్తే అడ్డగోలు బాగోతాలు ఎన్నో వెలుగు చూస్తాయని నగరపాలక సంస్థ వర్గాలంటున్నాయి. ఏళ్ల తరబడి నగరపాలక సంస్థకు నీటి పన్ను రూ.కోట్లలో పెండింగ్ ఉంది. అక్రమార్కులపై కమిషనర్ చర్యలు తీసుకుని పాలన గాడిలో ఉంచుతారో లేదో వేచి చూడాలి.